క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలో 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ ఏడీ అనంతయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



రాజాపూర్: రైతులు సాగు చేసుకున్న పత్తి, వరి పంటలను సస్యరక్షణ చర్యలు తీసుకుని కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. పిచికారీ చేయాల్సిన మందులపై సూచనలు చేశారు. ఏఓతో పాటు ఏఈఓ ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధులో ప్రాధాన్యత ఇవ్వాలి

అడ్డాకుల: దళితులలో ఉన్న అన్ని ఉప కులాలకు దళితబంధులో ప్రాధాన్యత ఇవ్వాలని సంఘం నాయకుడు సిరివాటి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మూసాపేట మండల కేంద్రంలో మంగళవారం ఎస్సీ ఉపకులాల నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భూత్పూర్: అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మంగళవారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు, స్కూల్ స్వీపర్ల సంఘం యూనియన్ల నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ఖలీల్, స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న ఉన్నారు. కాగా సమస్యలను ఆర్థిక మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే వారికి వివరించారు.

మహాధర్నాకు తరలిన కార్మికులు



జడ్చర్ల టౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ ఇందిరాపార్క్ వద్ద మంగళవారం నిర్వహించిన మహాధర్నాకు జడ్చర్ల మున్సిపల్ కార్మికులు బయలుదేరి వెళ్లారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్దిసేపు సమస్యలపై నినాదాలు చేశారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్, విజయ్, కేశవులు, జంగయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

నేడు మండల సభ

నివేదిక ఇవ్వని అధికారులు

నవాబుపేట: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. అయితే సమావేశానికి సంబంధించిన అభివృద్ధి నివేదికల్లో (15) 11 ఇప్పటికీ ఇవ్వకపోవడం విడ్డూరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కాగా సభలో మొక్కుబడిగా నివేదికలు చదివేందుకు పలువురు అధికారులు ప్రణాళికలు వేసినట్లు సమాచారం. కాగా మండల అభివృద్ధి విషయంలో అధికారులు మారటం లేదంటూ ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

ఆర్థికసాయం

మహమ్మదాబాద్: కనికెల కుంటతండాకు చెందిన గణేశ్ సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో బాధితకుటుంబానికి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తన కార్యకర్తల ద్వారా అంత్యక్రియలకోసం రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. హన్మంతు నాయక్, కిషన్‌నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ ఉన్నారు.

మధ్యంతర భృతి ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉద్యోగులకు వెంటనే 20శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఇవ్వాలని, ప్రమోషన్లు బదిలీలను వెంటనే చేపట్టాలని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నాయకులు వెంకటేష్, రవికుమార్, అజయ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను స్వాగతిస్తున్నాం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ వేయడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ 3 డీఏలు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు నాయుడు, సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈమేరకు మూడు డీఏలు కలిపి సుమారు 11శాతం ఇవ్వాలన్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెబుతూ 5శాతం డీఏ ఇవ్వడం శోచనీయమన్నారు. అదేవిధంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని వారు పేర్కొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



దేవరకద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దేవరకద్రలో మంగళవారం రూ. 1.21 కోట్లతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం షాపింగ్ కాంప్లెక్స్, కార్యాలయం, గోదాంలను ప్రారంభించి మాట్లాడారు. రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ పని చేస్తున్నాడని వివరించారు. డీసీసీ అధ్యక్షుడు నిజాం పాష, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ కార్యాలయం..

నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దేవరకద్ర, కొత్తకోట, చిన్నచింతకుంట మండలాలకు అందుబాటులో సబ్ ట్రెజరీ సేవలు కొనసాగుతాయని అన్నారు. ట్రెజరీ రాష్ట్ర డైరెక్టర్ కేఎస్ఆర్‌సీ మూర్తి, డీటీఓ బి.శ్రీనివాసులు, ఎస్‌టీఓ రాజగోపాలచారి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల..

దేవరకద్రలో రూ. 25 లక్షలతో నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, బి.మధుసూదన్‌గౌడ్, పశువైద్యాధికారి జీషన్‌అలీ, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం..

బల్సుపల్లిలో రూ. 20 లక్షలతో పంచాయతీ భవనాన్ని, అడవి అజిలాపూర్‌లో పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు, నార్లోనికుంట్లలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

దేవరకద్రలో జరిగిన కార్యక్రమంలో కౌకుంట్ల మండలానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

దేవరకద్ర రూరల్: గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌదర్‌పల్లిలో పంచాయతీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం లక్ష్మీపల్లిలో 175 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ, 20 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రూ. 5.15 కోట్ల చెక్కు అందజేత...

దేవరకద్ర: ఎల్‌టీ రుణాల కోసం దేవరకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో రూ. 5.15 కోట్ల చెక్కును డీసీసీబీ చైర్మన్ నిజాంపాష మంగళవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డికి అందజేశారు. దేవరకద్ర డీసీసీబీ బ్యాంకు నుంచి ఈ చెక్కును విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు రుణాలు ఇచ్చి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లా సీఈఓ లక్ష్మయ్య, శ్రీనివాసులు, నాబార్డు డీడీఎమ్ షణ్ముఖాచారి, జిల్లా సహకార అధికారి సుధాకర్, దేవరకద్ర మేనేజర్ వెంకటరమణచారి పాల్గొన్నారు.

కరోనా సమయంలో ఆశాల సేవలు మరువలేనివి

దేవరకద్ర: ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం గుర్తించిందని వాటిని తీర్చడానికి సానుకూలంగా ఉందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దేవరకద్రకు ఎమ్మెల్యే వచ్చిన సందర్భంలో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు ఆయనకు వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా మాట్లాడారు. కరోనా సమయంలో ఆశాల సేవలు మరువ లేనివని, సమస్యలను తన వంతుగా సీఎం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు.

ముగిసిన వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'సఫాయి మిత్ర సురక్ష'లో భాగంగా చివరి రోజు మంగళవారం 126 మంది పారిశుద్ధ్య కార్మికులకు పాతపాలమూరు యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నెల 26 నుంచి పట్టణంలోని రామయ్యబౌలి, కుమ్మరివాడీ, పాతపాలమూరు, మోతీనగర్ యూపీహెచ్‌సీలలో శిబిరం నిర్వహిస్తూ పరీక్షలు చేస్తున్న విషయం విదితమే. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మొత్తం 421 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

అభివృద్ధిలో ఆదర్శం ఆ గ్రామం



రాజాపూర్‌లో ఇటీవల ప్రారంభించిన నూతన గ్రామపంచాయతీ భవనం

రాజాపూర్ : రాజాపూర్ అభివృద్ధిలో దూసుకుపోతూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. మౌలిక వసతుల కల్పన, సీసీరోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు, రోడ్లకు ఇరువైపుల అవెన్యూ ప్లాంటేషన్‌తో కళకళలాడుతోంది. సర్పంచ్ కొప్పెరిబచ్చిరెడ్డి ఆధ్వర్యంలో..ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో సుమారు రూ. ఎనిమిదికోట్ల నిధులతో రాజాపూర్‌ను తీర్చిదిద్దారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మన ఊరు మనబడి పథకంలో కొత్త భవనం ఏర్పాటు చేశారు. దీంతో పాటు విద్యార్థులకు వసతులను కల్పించారు. అదేవిధంగా ఉన్నతపాఠశాలలో అదనపుగదులు, మరుగుదొడ్లు నిర్మించారు. గ్రామపంచాయతీ నిధులు, 14, 15 ఫైనాన్స్ తదితర నిధులతో గ్రామంలో పీర్లమసీదుతో పాటు మటన్‌మార్కెట్, ఈద్గా అదేవిధంగా వైకుంఠధామం, కులసంఘాలకు కమ్యూనిటీ భవనాల ఏర్పాటు వంటివి చేపట్టారు. ప్రాథమిక పాఠశాల పక్కన పంచాయతీ నూతన భవనాన్ని అన్ని హంగులతో సుందరంగా నిర్మించారు. ఎమ్మెల్యే సైతం ప్రారంభోత్సవ సమయంలో రాజాపూర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీసుకోవాలని సూచించడం గమనార్హం. అంతేకాకుండా కొత్తగా ఏర్పాటైన రాజాపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు లేకపోవడంతో శివారుల్లో ఏర్పాటు చేసిన వెంచర్లలో గ్రామపంచాయతీకి రావాల్సిన 10శాతం భూమిని పంచాయతీ పేర రిజిస్ట్రేషన్ చేయించి రెవెన్యూ, ఎంపీడీఓ, వ్యవసాయ శాఖ, విద్యుత్‌శాఖ తదితర కార్యాలయాల కోసం కేటాయించారు. వీటితో పాటు గ్రామంలో ఎవరైనా సెట్‌బ్యాక్ చేసుకుని ఇళ్లు నిర్మించుకునే విధంగా అనుమతులు ఇచ్చారు.



పంచాయతీ ఆవరణలో గాంధీజీ విగ్రహం



వాల్మీకి కమ్యూనిటీభవనం



ప్రాథమిక పాఠశాల నూతన భవనం

అన్ని విధాల అభివృద్ధి



ప్రస్తుత సర్పంచ్ బచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. చెత్తా చెదారం, మురుగు నిలిచేపోయే సమస్యలు తీరిపోయాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు ఏర్పాటు చేశారు. సీసీరోడ్లు నిర్మించారు. రోడ్లకు ఇరువైపుల పచ్చని చెట్లను పెంచడం వంటివి చేయడం సంతోషకరంగా ఉంది.

– మంగళి నారాయణ, గ్రామస్తుడు, రాజాపూర్

అందరి సహకారంతోనే..



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. వార్డు సభ్యులు, అన్ని పార్టీల పెద్దలతో చర్చించి దాదాపు రూ. ఎనిమిది కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశాం. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల భవనం, ఉన్నతా పాఠశాల అదనపుగదులు, మరుగుదొడ్లు వంటివి నిర్మించుకున్నాం. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సైతం అన్ని హంగులతో నిర్మించి ఇటీవలే ప్రారంభించాం.

– కొప్పెరిబచ్చిరెడ్డి, సర్పంచ్, రాజాపూర్

కాంగ్రెస్ 'గ్యారెంటీ'లు ప్రజలకు వరం

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం తీసుకువచ్చిన 6 గ్యారెంటీ పథకాలు ప్రజలకు వరం అని డీసీసీ ప్రధానకార్యదర్శి బంగ్లా రవి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. పథకాల గురించి గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో లోకిరేవు మాజీ సర్పంచ్ కృష్ణ, యాదయ్య, జంగయ్య, శివ, సత్యం, రాజు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



భూత్పూర్: మున్సిపాలిటీలోని 2వ వార్డు నర్సింగాపూర్‌లో మంగళవారం చైర్మన్ బస్వరాజ్ గౌడ్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో 24 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు వివరించారు. త్వరలో లబ్ధిదారులను గుర్తించి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ, ప్రారంభోత్సవం నిర్వహిస్తామన్నారు. నారాయణ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

చిన్నచింతకుంట: బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు ఆరోపించారు. మంగళవారం మండలంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన ఎన్నో హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా పేద ప్రజలకు పథకాలు అందించాలన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ముట్టడి ఉంటుందన్నారు. మండల అధ్యక్షుడు దశరథ్ తదితరులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో ఈనెల 15,16,17 తేదీల్లో జరిగే డీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన సత్యాగ్రహ దీక్ష వద్ద ఆయన మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ లోకమంత స్పందించి మహాసభల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీశైలం, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి మంత్రి కృషి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): యాదవుల అభ్యున్నతికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషి చేస్తున్నారని నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ నెల 2 జిల్లా కేంద్రంలో నిర్వహించిన యాదవ సమ్మేళనం విజయవంతం అయ్యిందన్నారు. సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు శాంతన్న, గోపాల్ యాదవ్ చందుయాదవ్, యువత సంఘం నాయకుడు నాచశ్రీను, శివకుమార్, కృష్ణ, బాల్‌చెన్నయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం, సీఎంలకు పోస్టుకార్డులు



పోస్టుకార్డులతో సీనియర్ సిటీజన్లు

నవాబుపేట: తల్లిదండ్రుల పోషణ, సంక్షేమం, రక్షణ చట్టాల సవరణ బిల్లు ఆమోదించాలని ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లకు సీనియర్ సిటీజన్‌లు పోస్టుకార్డులు రాశారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఆర్టీసీ బస్సుల టికెట్ల రాయితీ, రైల్వేలో గతంలో మాదిరిగా ప్రత్యేక టికెట్ ధరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోస్టుకార్డులను డబ్బాల్లో వేశారు. జిల్లా నాయకులు నాగభూషణం, నర్సింహులు, వెంకటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా కిసాన్ ఖేత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏడీఈ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. వినతిపత్రాన్ని సమర్పించారు. సర్పంచ్ గంగ్యానాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మినాజ్ నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చి పర్యటించాలి



మాట్లాడుతున్న కేబీఆర్ గౌడ్

అడ్డాకుల: హామీలను నెరవేర్చిన తర్వాతే మంత్రి హరీష్‌రావు నియోజకవర్గంలో పర్యటించాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కేబీఆర్ గౌడ్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్‌షఫీతో కలిసి మంగళవారం అడ్డాకులలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మంత్రులు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు జిల్లాల్లో తిరుగుతున్నారని విమర్శించారు. హరీష్‌రావు పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న శంకుస్థాపనలు



వీరన్నపేటలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో వరుసగా మూడోరోజూ మంగళవారం వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ శంకుస్థాపనలు చేశారు. 15వ వార్డులోని కర్రెమ్మచెల్కతండా, చిన్నదర్‌పల్లి, లచ్చిరాంతండా, పూజారితండా, చిర్మల్‌కుచ్చతండాలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ఆర్‌సీసీ స్లాబ్ కల్వర్టుకు భూమిపూజలు చేశారు. 31వ వార్డులోని వీరన్నపేటలో, 1వ వార్డులోని వెంకటేశ్వర కాలనీలో, 17వ వార్డులోని దొడ్డలోనిపల్లిలో, పిల్లలమర్రి రోడ్‌లో నిర్మించే సీసీరోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని నాయీ బ్రాహ్మణుల శ్మశానవాటిక ఏర్పాటుకు ఎకరా స్థలం కేటాయించారు. సంఘం నాయకులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు ముదిరాజ్ భవన నిర్మాణం కోసం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఘనస్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కులవృత్తులకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కులవృత్తులపై ఎన్నో ఆంక్షలు ఉండేవన్నారు. కోకాపేటలో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో ఆత్మగౌరవ భవనాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. 2014లోనే పండుగ సాయన్న సమాధిని గుర్తించినట్లు పేర్కొన్నారు. ముదిరాజుల చైతన్యానికి తన వంతుగా కృషిచేస్తున్నాని అన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి రాజీనామా చేయాలి'

పాలమూరు: మంత్రి నీతిమంతుడు అయితే వెంటనే పదవికి రాజీనమా చేయాలని, ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయని బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తికి పోలీస్ ఉన్నత అధికారులు సెల్యూట్ కొడుతుంటే న్యాయం ఎక్కడ దొరకుతుందన్నారు. ఈ రాష్ట్ర పాలనలో అంగన్‌వాడీలు, ఆశలు, ప్రభుత్వ ఉద్యోగులు అందరూ రోడ్లపై ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి రూ. కోట్ల నిధులు అభివృద్ధి కోసం కేటాయించినట్లు తెలిపారు. రైతులను ఆదుకోవడానికి కేంద్రం సబ్సిడీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, రాష్ట్ర నేతలు పద్మజారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని దీక్షలు

పాలమూరు: జిల్లాలో పని చేస్తున్న 104ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వేతనాలు చెల్లించడంలో ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే ట్రెజరీల ద్వారా ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద సమస్యల పరిష్కారంపై రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సుభాష్ చంద్ర, యాదగిరి, రమాదేవి, వినోద్, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.